ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
గురువారం
09 అక్టోబర్ 2025

ట్రంప్ పీస్ ప్లాన్ పై సంతకాలు... ఎక్స్ వేదికగా మోదీ పోస్ట్

అక్టోబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని, ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని స్వాగతించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వానికి ఇది అద్దంపడుతోందన్నారు. బందీలను విడుదల చేయడం, గాజా ప్రజలకు మెరుగైన మానవతా సాయం అందేలా చూడటం వల్ల శాశ్వత శాంతికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా పలు దేశాలు ఆహ్వానించాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగుపడిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. "గాజా మొదటి దశ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్లు అంగీకరించినందుకు గర్వంగా ఉంది. ఈ నిర్ణయంతో హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుంది" అని ప్రకటించారు. అలాగే సోమవారం బందీలు విడుదల కావొచ్చని చెప్పారు. అలాగే ఈ విషయంపై ఫోన్ కాల్లో ట్రంప్ మాట్లాడుతుంటే బందీల కుటుంబాలు ఆసక్తిగా వింటున్నట్లు ఉన్న ఒక వీడియోను వైట్ హౌస్ పోస్ట్ చేసింది. శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాల పూర్తి ఉపసంహరణ, మానవత సాయానికి అనుమతి, ఖైదీల మార్పిడి చోటుచేసుకోనుందని వెల్లడించింది. ఈ ఒప్పందం వేళ.. రష్యా స్పందించింది. ట్రంప్ అత్యున్నత ప్రతిపాదనలను చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ అభివర్ణించారు. ఒప్పందంలో నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, గాజాలోకి అన్నిరకాల నిత్యావసరాల సరఫరాలను కొనసాగించాలని ఐరాస పేర్కొంది.

పీస్ ప్రెసిడెంట్..

ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు 'పీస్ ప్రెసిడెంట్' అని వైట్ హౌస్ అభివర్ణించింది. ఆయన చేతిలో ఒక ఫైల్ పట్టుకొని నడిచివస్తోన్న ఫొటోను షేర్ చేసింది. ఇదిలాఉంటే.. తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఉన్న ఆశలను ట్రంప్ మరోసారి వ్యక్తంచేశారు. శాంతి బహుమతి విజేతను నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించనున్న నేపథ్యంలో దానిగురించి శ్వేతసౌధంలో రిపోర్టర్లతో మాట్లాడారు. నోబెల్ సంగతి తనకు తెలియదని, అయితే ఏడు యుద్ధాలు ఆపానని, ఎనిమిదో యుద్ధాన్ని కూడా ఆపబోతున్నట్లు చెప్పారు.

ఉప్పాడ మత్స్యకారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం పవన్

కాకినాడ, అక్టోబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ కలెక్టరేట్కు చేరుకున్నారు. ఉప్పాడ ప్రాంతానికి చెందిన మత్స్యకార ప్రతినిధులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మత్స్యకారులతో పవన్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

పరిశ్రమల వ్యర్థాలతో సముద్ర జలాలు కాలుష్యమయ్యాయని.. దీంతో తమ ఉపాధికి నష్టం వాటిల్లుతోందని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మత్స్య సంపద నాశనం అయిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్దిరోజుల క్రితం ఉప్పాడలో మత్స్యకారులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. పరిశ్రమల వ్యర్థాలతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని.. ప్రభుత్వం ఆదుకోవాలని ధర్నా చేపట్టారు. ఈ నిరసనపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఓ కమిటీని నియమించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాను కూడా కాకినాడ వచ్చి మత్స్యకారులతో సమావేశమవుతానని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు నేడు పవన్ కాకినాడ వచ్చారు. మధ్యాహ్నం నిర్వహించనున్న బహిరంగసభలోనూ ఆయన మాట్లాడనున్నారు. అంతకుముందు కాకినాడలో హెలిప్యాడ్ వద్ద పవన్కు జిల్లా కలెక్టర్ షాన్మోహన్, జనసేన నేతలు స్వాగతం పలికారు.

స్థానిక ఎన్నికలు.. ఈరోజులోపు తాలివిడత అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలి:రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై అన్ని పరిస్థితులను ఎదుర్కొని ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు. "ఇన్చార్జి మంత్రులు.. ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలి.

నామినేషన్ల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలి. నామినేషన్ల దరఖాస్తు నమూనా పత్రం క్షేత్రస్థాయికి పంపాలి. రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ఖరారు చేయాలి. వారికి బీ ఫారం ఇవ్వాలి.. నో డ్యూ పత్రాలు ఇప్పించాలి. న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీ భవన్లో సమన్వయ కమిటీ ఉండాలి. టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉన్నవారు కమిటీలో ఉండేలా చూడాలి. ఎంపీపీలు, జడ్పీ చైర్మన్ పదవుల ఎంపికను పీసీసీ నిర్ణయిస్తుంది. పీసీసీ నిర్ణయించే వరకు రాజకీయ ప్రకటనలు చేయవద్దు. హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసుపై పీసీసీ చీఫ్ పర్యవేక్షించాలి. ఉన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత తదుపరి కార్యాచరణపై రాత్రి మరో భేటీ నిర్వహిస్తాం. తొలివిడత కోసం రాత్రికి అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలి" అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

భారీగా చేరుకున్న బిఆర్ఎస్ శ్రేణులు.. ఆర్టీసీ బస్ భవన్ వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్, అక్టోబర్ 9, (రిపబ్లిక్ న్యూస్): ఆర్టీసీ బస్ భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ లో బస్సు ఛార్జీల పెంపును నిరసిస్తూ మాజీ మంత్రులు, భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేతలు అక్కడికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. హరీశ్ రావు మెహదీపట్నం నుంచి బస్సులో బస్ భవన్కు వచ్చారు. రేతి ఫైల్ బస్టాండ్ నుంచి కేటీఆర్, తలసాని, పద్మారావు చేరుకున్నారు. బస్సు ఛార్జీలు తగ్గించాలంటూ ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇవ్వనున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఇండస్ట్రీకి వచ్చాక ప్రతీది నన్ను మార్చేసింది.. 22 ఏళ్ల కెరీర్ పై నయనతార నోట్

తన నటనతో లేడీ సూపర్ స్టార్ అనే పేరును సొంతం చేసుకున్నారు నటి నయనతార. భాషతో సంబంధం లేకుండా అగ్ర కథానాయకుల సినిమాల్లో నటిస్తూ అలరిస్తున్నారు. ఆమె ఇండస్ట్రీకి వచ్చి నేటికి 22 ఏళ్లు పూర్తైంది. ఈసందర్భంగా అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ ఎమోషనల్ నోట్ను పంచుకున్నారు."మొదటిసారి కెమెరా ముందు నిల్చొని నేటికి 22 ఏళ్లు అయింది. సినిమాలే నా ప్రపంచంగా మారతాయని అప్పుడు తెలియదు. అది తెలియకుండానే సినీ రంగ ప్రవేశం చేశాను. పరిశ్రమకు వచ్చిన తర్వాత ప్రతి షాట్, ప్రతి ఫ్రేమ్, ప్రతి నిశ్శబ్దం నన్ను మార్చేశాయి. నాకు ధైర్యాన్నిచ్చాయి. నన్ను నన్నుగా మలిచాయి. ఈ ప్రయాణంలో నాకు తోడుగా నిలిచిన ప్రతిఒక్కరికి ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని నయనతార తన నోట్లో రాసుకొచ్చారు. 2003లో మలయాళ చిత్రం 'మనస్సినక్కరే' అనే చిత్రంతో నయనతార ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు. 'చంద్రముఖి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వరుస అవకాశాలతో మెప్పిస్తున్నారు. 'జవాన్'తో బాలీవుడ్లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం నయనతార చేతిలో 8 ప్రాజెక్టు ఉన్నాయి. వాటిలో చిరంజీవి- అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు' కూడా ఒకటి. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

బీసీసీఐకి వ్యతిరేకంగా పిల్.. దిల్లీ హైకోర్టు అసహనం

భారత క్రికెట్ బోర్డుకు చెందిన జట్టును 'టీమ్ ఇండియా' అని ప్రసార భారతి సంబోధించడం సరైంది కాదంటూ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్ ను దిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఇదంతా మీకు, మాకు సమయం వృథా అని పిటిషనర్తో దిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. చీఫ్ జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు పిటిషన్ ను తిరస్కరించింది. బీసీసీఐ ప్రైవేటు సంస్థ అని.. భారత ప్రభుత్వంతో దానికి సంబంధం లేదని న్యాయవాది రీపక్ కన్సాల్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. భారత జాతీయ క్రికెట్ జట్టు అని బీసీసీఐ సంబోధించడం వల్ల తప్పుడు ప్రభావం పడుతుందని అందులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రసార భారతి, ఆన్ఇండియా రేడియో వంటి వాటిల్లోనూ బీసీసీఐ టీమ్ను 'భారత జట్టు'గా పిలవడం సరైంది కాదని పిటిషనర్ పేర్కొన్నారు. దీనివల్ల ప్రైవేటు సంస్థకు ఆర్థికపరమైన లబ్ధి చేకూరుతోందని అందులో తెలిపారు. అయితే, ఈ పిటిషన్పై దిల్లీ హైకోర్టు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రపంచవ్యాప్తంగా క్రీడలకు సంబంధించి పద్ధతి ఎలా ఉందో మీకు తెలుసా? అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ రూల్స్పై మీకు అవగాహన ఉందా? ఆ కమిటీలపై కేంద్రం లేదా రాష్ట్రాల జోక్యం ఉండకూడదనేది వారి పాలసీ. కానీ, మీరు (పిటిషనర్) మాత్రం ప్రభుత్వ అధికారులు ఎంపిక చేసిన జట్టే భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాలని అంటున్నారు. అయితే, ఒలింపిక్ కమిటీ పాలసీపై మీకు అవగాహన ఉందా? గతంలో ఎప్పుడైనా క్రీడా సమాఖ్యల్లో ప్రభుత్వం కలుగజేసుకున్న సందర్భాలు ఉన్నాయా? " అని హైకోర్టు ఘాటుగా ప్రశ్నించింది.

ఇంటి చిట్కాలు

బొప్పాయితో పాటు ముఖంపై ముడతలు తగ్గించి అందాన్ని పెంచే పండ్లు, ఎప్పుడు తినాలంటే

చిన్న వయసులోనే ముఖంపై ముడతలు రావడం వెనుక చాలా కారణాలు ఉండవచ్చు. వీటిలో సరైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి వంటి కారణాలు ఉంటాయి. ముడతల సమస్య, వృద్ధాప్య ఛాయల్ని తగ్గించడం కోసం సరైన జీవనశైలితో పాటు సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం.

ప్రతి ఒక్కరూ అందంగా ఉండాలని కోరుకుంటారు. అయితే, ఈ రోజుల్లో లైఫ్స్టైల్, కాలుష్యం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు అనేక చర్మ సమస్యలకు కారణమవుతున్నాయి. ఇక, వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు రావడం కామన్ ప్రాబ్లమ్. అయితే, చాలా మంది చిన్న వయసులోనే ముఖంపై ముడతలు వచ్చి ముసలి వారిలా కనిపిస్తున్నారు. దీంతో.. చాలా మంది ఆందోళన చెందుతున్నారు. చిన్న వయస-ఎలోనే ఇలా ఎందుకు జరుగుతుందని ఆలోచిస్తున్నారు. చిన్న వయసులోనే ముఖంపై ముడతలు రావడం వెనుక చాలా కారణాలు ఉండవచ్చు. వీటిలో స²ైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి వంటి కారణాలు ఉంటాయి. ముడతల సమస్య, వృధాప్య ఛాయల్ని తగ్గించడం కోసం సరైన జీవనశైలితో పాటు సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ఆహారంలో కొన్ని పండ్లను భాగం చేసుకోవాలి. ఈ పండ్లు తినడం వల్ల ముఖంపై ముడతలు తగ్గి అందం రెట్టింపు అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఆ పండ్లు ఏంటంటే..

బొప్పాయి

బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది చర్మం ఆరోగ్యంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఫోలిక్ యాసిడ్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, వంటి ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఈ పండులో ఉన్నాయి. ఇవి చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బొప్పాయిలో ఉండే పపైన్ ఎంజైమ్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు వృద్ధాప్య సమస్యను తగ్గిస్తుంది. బొప్పాయిలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ముఖంపై ముడతల్ని తగ్గిస్తాయి. ప్రతి రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తింటే ఈ ప్రయోజనాలు రెట్టింపు అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

అరటి పండు

అరటి పండు ఆరోగ్యానికి చేసే మేలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అరటిలో అధిక మొత్తంలో పొటాషియం, విటమిన్లు ఉన్నాయి. అంతేకాకుండా ఎన్నో పోషకాలు అరటి పండు తినడం వల్ల లభిస్తాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా, మెరుస్తూ ఉండటానికి సాయపడతాయి. అరటి పండు తినడం వల్ల చర్మంపై ముడతలు తగ్గుతాయి. అంతేకాకుండా బ్లడ్ షుగర్, కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ మొదలైన సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అరటి పండును బ్రేక్ ఫాస్ట్ తర్వాత, సాయంత్రం తింటే మంచిది.

యాపిల్



యాపిల్లో సహజ చక్కెర, ఫ్రక్టోజ్ ఉన్నాయి. యాపిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందుకే ఉదయాన్నే ఖాళీ కడుపుతో యాపిల్ తింటే చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడటంతో పాటు రోజంతా ఎనర్జిటిక్ గా ఉంచుతుంది. యాపిల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చర్మాన్ని ఆరోగ్యంగా, ముడతలు లేకుండా ఉంచడంలో సహాయపడతాయి.

ద్రాక్ష

ద్రాక్ష పండ్లలో చర్మానికి మేలు చేసే ఎన్నో గుణాలు ఉన్నాయి. ఈ పండులో ఉంటే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ద్రాక్ష పండు తినడం వల్ల ముఖంపై ముడతలు తొలగిపోయి చర్మం కాంతివంతంగా మారుతుంది. ద్రాక్ష పండును బ్రేక్ ఫాస్ట్ తర్వాత లేదా మధ్యాహ్నం తింటే మేలు.

ఇవి కూడా ముఖ్యం

చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం కోసం పై చెప్పిన పండ్లతో పాటు కొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలి. హైడ్రేట్గా ఉండటం తప్పనిసరి. అందుకోసం తగినంత నీళ్లు తాగండి. ఆహారంలో పండ్లతో పాటు గింజలు, నట్స్ కూడా యాడ్ చేసుకోండి. బాదం, వాల్ నట్స్, గుమ్మడి గింజలు వంటివి డైట్లో భాగం చేసుకోవాలి. వీటితో పాటు తగినంత నిద్ర, వ్యాయామాన్ని కూడా అలవాటు చేసుకుంటే చర్మంపై ముడతలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక: ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.